క్లుప్తంగా

సభను విజయవంతం చేయండి



మిడ్జిల్: పార్లమెంట్ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న జడ్చర్లలో నిర్వహించ తలపెట్టిన సన్నాహక సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ జంగయ్య కోరారు. సోమవారం మండల కేంద్రంలో అనుబంధ సంస్థల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు సురేష్, వెంకటయ్య, ధనరాజ్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల



మిడ్జిల్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఆగస్టు 1న నిర్వహించ తలపెట్టిన హైదరాబాద్ మార్చ్ కోసం మహా ఉద్యమం వాల్‌పోస్టర్‌ను సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విడుదల చేశారు. ఈసందర్భంగా ఏబీవీపీ జిల్లా ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ వడ్డెశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఝాన్సీ, సుజాత, శివ తదితరులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: వచ్చే నెల 4 న హైదరాబాద్‌లో నిర్వహించే కార్మిక గర్జన వాల్‌పోస్టర్‌ను మండల కేంద్రంలో సోమవారం ఐఎఫ్‌టీయూ నాయకులు విడుదల చేశారు. జిల్లా అధ్యక్షుడు దేవదానం మాట్లాడుతూ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. చంద్రన్న, కోళ్ల వెంకటన్న, కొండన్న పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



అడ్డాకుల: మండలంలోని వర్నె, రాచాల గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలను సోమవారం జెడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి పరామర్శించారు. వర్నెలో బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందిన బాలుడు సుశాంత్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం చేశారు. రాచాలలో ఉప్పరి అశోక్ ఇటీవల పాముకాటుతో మృతిచెందడంతో బాధిత కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. అశోక్ భార్యకు ప్రభుత్వం నుంచి పింఛన్ మంజూరయ్యే వరకు తన సొంత డబ్బులతో నెలకు రూ.2వేలు ఇస్తానని హామీ ఇచ్చారు. ఈనెల డబ్బులు రూ.2వేలను అందజేశారు. పిల్లల చదువులకు సాయం చేస్తానని తెలిపారు. విండో చైర్మన్ జితేందర్‌రెడ్డి, కోఆప్షన్ ఖాజాఘోరీ, చక్రపాణిరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సురేష్, కృష్ణ, మహేందర్ ఉన్నారు.

అడ్డాకుల: మండలంలోని వర్నె గ్రామానికి చెందిన సహదేవ్ కుమారుడు సుశాంత్(7వ తరగతి) బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని సోమవారం సాయంత్రం డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. మండలాధ్యక్షుడు తోట శ్రీహరి, మాజీ అధ్యక్షుడు కారెడ్డి నాగిరెడ్డి, సర్పంచ్ బంగారయ్య తదితరులు ఉన్నారు.

ఇంటర్ టాపర్‌కు రూ.30 వేలఆర్థికసాయం



మిడ్జిల్: బోయిన్‌పల్లి గ్రామానికి చెందిన సింధుకు విలేజెస్ ఇన్ పాట్నర్ షిప్ (వీఐపీ) సంస్థ వారు సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో రూ. 25 నగదు అందజేశారు. అదేవిధంగా సర్పంచ్ నారస్‌రెడ్డి రూ. 5 వేలు ఇచ్చారు. ఆమె ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 949 మార్కులు సాధించి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల టాపర్‌గా నిలిచిందని ప్రిన్సిపాల్ వెంకటయ్య తెలిపారు. బాలికలను ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో నగదు అందజేశారని ఆయన వివరించారు. సంస్థ డైరెక్టర్ నాగేందర్‌స్వామి పాల్గొన్నారు.

చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి మండల టాపర్లకు సోమవారం క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. 8 మంది టాపర్లకు రూ.1116 చొప్పున నగదు, మెడల్‌ను అందజేశారు. ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి మాట్లాడుతూ కష్టపడి చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఎంఈఓ నాగయ్య, సర్పంచ్ కల్పన, హెచ్ఎం ఫయాజుద్దీన్, క్లాస్‌మెట్ క్లబ్ సభ్యులు శ్రీకాంత్, గోపాల్ పాల్గొన్నారు.



సంక్షేమమే బీఆర్ఎస్ ఎజెండా



జడ్చర్లలో ఉర్దూ ఘర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, తదితరులు

● ఎమ్మెల్యే సి.లక్ష్మారెడ్డి

జడ్చర్ల: అభివృద్ధి, సంక్షేమమే తమ ప్రభుత్వ ఎజెండా అని ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డి అన్నారు. జడ్చర్లలో రూ.35 లక్షల వ్యయంతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. కావేరమ్మపేట 1వ వార్డు క్రిస్టియన్ కాలనీలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులకు భూమిపూజ చేశారు. అదేవిధంగా 11వ వార్డులో బొడ్రాయి వద్ద సీసీరోడ్డు పనులు, 8వ వార్డు హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉర్దూ ఘర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం సాధించుకున్న తరువాత ఎన్నో అభివృద్ధి పనులను చేపట్టుకున్నామని గుర్తు చేశారు. స్వరాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో కొనసాగిస్తూ ముందుకు వెళ్తున్నామని అన్నారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు.

కేటీఆర్ జన్మదిన వేడుకలు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. అనంతరం మైనార్టీ కుటుంబాలకు రూ. లక్ష ఆర్థిక సహాయం అందించడాన్ని హర్షిస్తూ స్థానిక క్రిస్టియన్, ముస్లిం మైనార్టీలు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని కలిసి అభినందించారు. శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మి, వైస్ చైర్ పర్సన్ సారిక, కౌన్సిలర్లు జ్యోతి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రపతి పాలన విధించాలి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నాయకులు కోరారు. ఆ రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలకు నిరసనగా సోమవారం పీయూ ప్రధాన గేట్ ఎదుట వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హింసకు పాల్పడిన ముష్కరులను కఠినంగా శిక్షించాలన్నారు. తక్షణమే మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలన్నారు. ఆయా సంఘాల నాయకులు పవన్‌రెడ్డి, అంజనేయులు, మారుతి, రవికుమార్, భాస్కర్, వెంకటేశ్ పాల్గొన్నారు.



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

రైతులను మోసం చేసేందుకు కుట్ర

కోయిల్‌కొండ: వ్యవసాయానికి 3గంటల విద్యుత్ చాలు అంటూ కాంగ్రెస్ రైతులను మోసం చేసేందుకు కుట్ర పన్నుతోందని ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం సూరారంలో రైతు సదస్సు నిర్వహించారు. తెలంగాణ ఏర్పడితే రాష్ట్రం అంధకారం అవుతుందని విమర్శించారని, కానీ నేడు కోతల్లేని విద్యుత్‌ను అందిస్తూ సీఎం కేసీఆర్ చరిత్రలో నిలిచారని అన్నారు. సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, నాయకులు భీంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య, మోదీపూర్‌రవి పాల్గొన్నారు.

రూ.30 లక్షల నిధులు మంజూరు

కోయిల్‌కొండ: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు రూ.30లక్షల నిధులు మంజూరైనట్లు ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డిలు తెలిపారు. మండలంలోని వీరంపల్లికి సీసీ రోడ్డు రూ.6 లక్షలు, హనుమాన్‌గడ్డతండా సీసీరోడ్డుకు రూ.4లక్షలు, సంగనోనిపల్లిలో మెటల్‌రోడ్డుకు రూ.5లక్షలు అదేవిధంగా లింగుపల్లిలో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.15లక్షలు మంజరయ్యాయని తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలింపు



పెట్రోల్ బంక్ వెనుకభాగంలో డంపు చేసిన ఇసుక

చిన్నచింతకుంట: అల్లిపురం ఊకచెట్టు వాగు నుంచి రెండురోజులుగా కొందరు అక్రమంగా ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయంలో ఎడ్ల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించి సమీప పొలంలో డంపులు చేసి అక్కడి నుంచి ఆత్మకూర్, అమరచింత, మండలాలకు ట్రాక్టర్‌కు పంపిస్తున్నారని వివరించారు. ఆదివారం రాత్రి కొందరు ఇసుక తరలించి పలుచోట్ల దాదాపు 50 ట్రిప్పులు నిల్వ ఉంచారని వివరించారు. తహసీల్దార్ సువర్ణరాజును వివరణ కోరగా తమ దృష్టికి రాలేదన్నారు. వెంటనే పరిశీలించి ఇసుక డంపులను సీజ్ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వివరించారు.

మొక్కలను సంరక్షించాలి



కోయిల్‌కొండ: హరితహారంలో భాగంగా ఇంటింటికీ అందిస్తున్న మొక్కలను సంరక్షించాలని పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ అన్నారు. సోమవారం రాంపూర్‌లో మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్: ప్రతి ఇంటికి మొక్కల పంపిణీ కార్యక్రమం సోమవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణారావు తెలిపారు. ఇప్పటికే పలు గ్రామాల్లో కార్యక్రమం చురుగ్గా సాగుతోందని వివరించారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కార్మికులకు బీఆర్ఎస్ నాయకుల సంఘీభావం



కోయిల్‌కొండలో సమ్మెలో పాల్గొన్న పంచాయతీ కార్మికులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: హన్వాడలో కార్మికులు భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. నాయకుడు బాలు కార్మికులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెకు సోమవారం బీఆర్ఎస్ నాయకులు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, సర్పంచులు శ్రీకాంత్, కిషన్‌నాయక్, నాయకులు మహిమూద్, రమేష్‌గౌడ్, విజయకుమార్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, బాలరాజు తదితరులు ఉన్నారు.

కోయిల్‌కొండ: మండలంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నర్సిములు, కార్మిక సంఘం నాయకులు శ్రీనునాయక్, అజ్జుపాషా, కురుమూర్తి పాల్గొన్నారు.

భూత్పూర్: కార్మికులపై ప్రభుత్వం చిన్నచూపు తగదని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం భూత్పూర్‌లో సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: మండలంలో పంచాయతీ కార్మికులు లక్ష్మయ్య, శ్రీను, నర్సింహ, రమేష్, వెంకటయ్య, నర్సింహులు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్: మండలంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు.



నవాబుపేటలో..



హన్వాడలో భిక్షాటన

చిన్నచింతకుంట: మండలంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి సీహెచ్ రాంచందర్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం వేడుకలపై సమావేశం



కోయిల్‌కొండ: జిల్లాలో ప్రసిద్ధిచెందిన కోయిల్‌కొండ బీబీఫాతిమా మొహర్రం ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ మురళీ అన్నారు. సోమవారం మండల అధికారులు, నిర్వాహకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ జయరాములు, భీంరెడ్డి, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



చెక్కును అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి



బండర్‌పల్లిలో..

మహబూబ్‌నగర్ న్యూటౌన్: హన్వాడలో కేటీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ నరేందర్, నాయకులు లక్ష్మయ్య, కృష్ణయ్యగౌడ్, యాదయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

అడ్డాకుల: మండల కేంద్రంలో ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, సర్పంచులు శ్రీకాంత్, కిషన్ నాయక్, నాయకులు పాల్గొన్నారు.

నవాబుపేట: మండల కేంద్రంలో వృక్షార్చన కార్యక్రమం నిర్వహించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల సముదాయాల్లో మొక్కలు నాటారు. మండల కేంద్రంలో యువత నాయకులు చిన్నారులతో కలిసి కేక్ కట్ చేయించారు. జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, కోఆప్షన్ తాహేర్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

భూత్పూర్: పట్టణంలో మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు మనిమోని సత్యనారాయణ, సీనియర్ నాయకుడు మురళీధర్ గౌడ్ కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

దేవరకద్ర: కేటీఆర్ జన్మదిన వేడుకలు బండర్‌పల్లి చెక్ డ్యాం వద్ద ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ రమాదేవి, బీఆర్ఎస్ అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డిలు, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణకు మంచిపేరు తేవాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : విద్యార్థులు బాగా చదువుకొని తెలంగాణకు మంచిపేరు తేవాలని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అన్నారు. కేటీఆర్ జన్మదినం సందర్భంగా సోమవారం ఎనుగొండలోని సన్నిధి అనాథాశ్రమంలో వేడుకలు నిర్వహించారు. ఎస్‌వీఎస్ మెడికల్‌కాలేజీ విద్యార్థి ఊర్మిలకు రూ.25 వేలు ఆర్థికసాయం చేశారు. 47వ పుట్టినరోజు సందర్భంగా 47 మంది అనాథలను దత్తత తీసుకుని, ప్రయోజకులుగా తీర్చిదిద్దుతానని ప్రకటించారు. పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. జెడ్పీటీసీలు వెంకటేశ్వరమ్మ, అన్నపూర్ణ, రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజు, ఎన్ఆర్ఐ రామయ్య, ట్రెజరర్ జగపతిరావు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు

నవాబుపేట: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని, జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ పురుషోత్తం తెలిపారు. సోమవారం యన్మన్‌గండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు సైబర్ నేరగాళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని వివరించారు. మొబైల్స్ వాడకం తగ్గించాలని సూచించారు. అదేవిధంగా పోలీసు సురక్ష బృందం పాటలు, నాటికలతో అలరించారు. కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ పురుషోత్తం

ముంపు ప్యాకేజీ త్వరగా ఇవ్వాలని వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న వల్లూరు ఎస్సీకాలనీవాసులు

జడ్చర్ల టౌన్: పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ ఉదండాపూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న తమ ఎస్సీ కాలనీవాసులకు పునరావాస ప్యాకేజీ త్వరగా ఇప్పించాలంటూ వల్లూరు గ్రామస్తులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. తమ భూములు ఇప్పటికే ముంపులో పోయాయని, ఇళ్లు సైతం పోతున్నాయని వినతిపత్రంలో పొందుపర్చారు. రిజర్వాయర్ కట్ట నిర్మాణం జరుగుతున్నందున వరదనీరు నిలిచి తమ ఇళ్లల్లోకి పాములు, కప్పలు అధికంగా వస్తున్నాయని విన్నవించారు. సమీపంలోనే ఉన్న తుమ్మలకుంట, ర్యాగడిపట్టతండా, చిన్నకుంటతండాలకు ప్లాట్లు, ప్యాకేజీ కేటాయింపులు జరుగుతున్నాయని వారితోపాటే తమకు ఇప్పించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు వివరించారు.

27న ఇంటర్వ్యూలు

జడ్చర్ల టౌన్: డా.బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 15మంది గెస్ట్ లెక్చరర్ల నియామకం కోసం ఈనెల 27న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా. అప్పియాచిన్నమ్మ తెలియజేశారు. ఇంగ్లీష్, తెలుగు, సంస్కృత, వాణిజ్యశాస్త్రం, రాజనీతిశాస్త్రం, కంప్యూటర్‌సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, జంతుశాస్త్రం కోసం నిర్వహించే ఇంటర్వ్యూలకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు 27 ఉదయం 11గంటలలోపు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

హోర్డింగ్‌లను తొలగించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : జిల్లా కేంద్రంలోని 167 జాతీయ రహదారిపై కాంగ్రెస్‌ను కించపరిచేలా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లను వెంటనే తొలగించాలని పార్టీ నాయకుడు సాయిబాబా కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ రవినాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. నిబంధనలకు విరుద్ధంగా హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారని వివరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

జడ్చర్ల టౌన్: సీపీఎస్ ఉద్యోగుల మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు సనాతన బాలస్వామి సోమవారం తెలిపారు. అధ్యక్షుడిగా శంకర్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్, కోశాధికారిగా రామ్మోహన్, మహిళా అధ్యక్షురాలుగా నాగేశ్వరి, మండల సలహాదారులుగా గోపినాథ్, తిమోతి, నర్సింహులు, శంషోద్దీన్, బాబు, జాని, నరసింహ్మారావు, వెంకటయ్య, నాగేందర్, కృష్ణ ఎన్నికైనట్లు వివరించారు.

సీఐకి సన్మానం

భూత్పూర్: ఇటీవల బదిలీపై వచ్చిన భూత్పూర్ సీఐ రామకృష్ణను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సన్మానించారు. అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సాధిక్, మాజీ మండల అధ్యక్షుడు వెంకట్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



జడ్చర్ల టౌన్: మాచారం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గ్రామానికి చెందిన ట్రాఫిక్ సీఐ లక్ష్మణ్ సోమవారం నోట్‌పుస్తకాలు, ఇతర సామగ్రి పంపిణీ చేశారు. 8 ఏళ్లుగా సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెచ్ఎం అంజలి, గ్రామస్తులు ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు.

పండ్లతోట పెంపకానికి రాయితీ

గండేడ్: పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం రాయితీ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలం పరిధిలోని సన్న, చిన్నకారు రైతులు 5 ఎకరాల లోపు ఉన్న వారికి ఇది వర్తిస్తుందని అన్నారు. మామిడి, బత్తాయి, డ్రాగన్ ఫ్రూట్ తదితరాలకు రాయితీ ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు వందశాతం, బీసీలకు 90 శాతం ఇవ్వనున్నట్లు వివరించారు. ఆసక్తి కలిగిన రైతులు ఈనెల ఆఖరు వరకు దరఖాస్తు చేసుకోవాలని, హార్డ్ కాపీని ఎంపీడీఓ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

'మాకూ వర్తింపజేయాలి'



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పారిశుద్ధ్య కార్మికులకు పెంచిన రూ.వేయి వేతనాన్ని వాటర్ సప్లయ్ వర్కర్లకూ వర్తింపజేయాలని బీఆర్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కె.వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి ఉదయ్‌కుమార్, ప్రచార కార్యదర్శి రంగస్వామి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ దృష్టికి తీసుకెళ్తామని చైర్మన్ హామీ ఇచ్చారు.

మూసాపేట ఎస్ఐగా కె.శ్రీనివాసులు

అడ్డాకుల: మూసాపేట ఠాణా ఎస్ఐగా కె.శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఆయన జోగులాంబ గద్వాల జిల్లా శాంతినగర్ ఠాణా నుంచి ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ విజయభాస్కర్ మహబూబ్‌నగర్ జిల్లా హెడ్ క్వార్టర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు మండల ప్రజలు సహకరించాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కిట్స్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పట్టణంలోని 47వ వార్డులో పారిశుద్ధ్య కార్మికులకు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంజయ్య, వివేకానంద సేవా సంఘం నాయకులు దర్పల్లి హరికృష్ణ సోమవారం రెయిన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్మికులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

గుండెపోటుతో వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు మృతి

అడ్డాకుల/నవాబుపేట/జడ్చర్ల టౌన్: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు గుండెపోటుకు గురై సోమవారం మృతిచెందారు. అడ్డాకుల మండలంలోని కందూర్‌లో పొలం పనులు చేస్తూ రైతు మాందిపేట చిన్న హనుమంతు(56), నవాబుపేట మండలం కూచూర్‌లో మాజీ సర్పంచ్ చుక్కమ్మ (53) ఇంట్లో పనులు చేసుకుంటూ, జడ్చర్లలో విశ్వబ్రాహ్మణ మనుమయసంఘం మండల ఉపాధ్యక్షుడు రవీంద్రచారి (56) మరణించారు.

వృద్ధురాలు అదృశ్యం

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ గ్రామానికి చెందిన సూరయ్యగారి రాములమ్మ(75) అదృశ్యమైనట్లు ఎస్ఐ.శ్రీనివాసులు తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం రాములమ్మ తన మనువడు అగు సూరయ్య గారి మహేష్ వద్ద ఉంటోంది. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో గ్రామంలోకి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లింది. రాత్రి వరకు రాకపోవడంతో గ్రామంలోనూ, బంధువుల వద్ద వెతికినా కన్పించలేదు. దీంతో సోమవారం మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పాలభిషేకం చేస్తున్న వీఆర్ఏలు



మహమ్మదాబాద్‌లో..

మహమ్మదాబాద్: వీఆర్ఏలను రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం జీఓను విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వీఆర్ఏల జేఏసీ చైర్మన్ గంగాధర్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల: సీఎం కేసీఆర్ చిత్రపటానికి వీఆర్ఏలు సోమవారం క్షీరాభిషేకం చేశారు. కేటీఆర్ జన్మదినం పురస్కరించుకుని స్వీట్లు పంపిణీ చేశారు. ఆంజనేయులు, అంజనమ్మ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: వీఆర్ఏలను క్రమబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకోవడంపై ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ సోమవారం మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సంబురాలు నిర్వహించారు. కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎండీ మునీర్, చైర్మన్ యాదగిరి, గోవర్ధన్, శేఖర్, రమేష్, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.